
కథ



# దాంపత్య సుధ

– వి.ఎం.ఎస్. స్వాతి

అంతదాకా భర్త కోసం ఎదురు చూసీ చూసీ అప్పుడే మాగన్నుగా నిద్ర పట్టింది సత్యవతికి. ఆమె ఇటు మత్తులో కూరుకు పోవడమూ, అటు భర్త లోనికి రావడమూ ఒకేసారి జరిగాయి.

'సారీ సత్యా లేటయ్యింది' పెదవి దాటి రాలేదతని మాట, భార్య సోఫాలో జారగిలబడిన తీరు చూస్తూనే.

ఆడది ఏ దశలో వున్నా అందానికి పట్టు గొమ్మే! ఆమెలో కనిపించే అందాలను, కనిపించని అందాలను ఎంత చూస్తే మాత్రం తనివి తీరుతుంది?

మరీ ఈ 'అతివ' వాలిన దృశ్యాన్ని చూస్తుంటే...

ఆ భగవంతుడు ఆడదాని సరసన వుండడం వల్లనే మగవాడి మనసును నిత్య వసంతంలా వుండేలా మలిచాడన్నా అతిశయోక్తి కాదు!

ఈ విధమైన పులకాంకిత మధురోహాలతో కాసేపలాగే భార్య సమ్మోహన, సువిశాల అందాల కనువిందుతో తృప్తి చెంది–

తదుపరి కార్యక్రమాల నిమిత్తమై నిశ్శబ్దంగా అక్కణ్ణుంచి కదిలాడు ఆనంద్.

అతనటు తన ముందు నుంచి కదులుతు న్నప్పుడే మెలకువ వచ్చింది సత్యవతికి.

అంతగా ఒళ్ళు తెలియకుండా నిద్ర పట్టిందే తనకి! గాఢ నిద్ర కాదు గదా!

చకోర పక్షిలా భర్త రాక కోసం ఎదురు చూస్తూ మధ్యలో నిద్రా దేవి ఒడిలోకి జారిందంతే!

అయినా అట్టే సేదతీరనిస్తేనా శరీరం!

దాన్ని అలారంలా జాగృత పరిచే మనసు...

'చూస్తాము అబ్బాయి గారు తన పనులు విసుక్కోకుండా ఎలా చేసుకుంటారో! అలవాట్లో పొరపాటుగా పనుల మధ్య నా సహకారాన్నాశించి 'సత్యా!' అని పిలవబోరా? నేనిటు నిద్ర పోతున్నాననైనా గుర్తుకు రాకుండా అన్ని వేళలా భర్తకు వేదోడు వాదోడుగా భార్య వుండాల్సిందేనా? ఏం? మగవాడు ఒంటి చేత్తో తన పనులు తాను చేసుకు పోకూడదా? నిజంగా భార్యను ప్రేమిస్తోన్న పక్షంలో ఆమెను అడుగడుగునా కష్టపెట్టకూడదని...'హఠాత్తుగా ఈ తలపుతో తలెత్తి పైకి లేవబోతున్నదల్లా, మనసు మార్చుకుని మళ్ళీ మునుపటి పోజులోకి ఒరిగింది సత్యవతి.

ఈవిడ అనుకున్నట్టేమీ జరగలేదు.

తన పాటికి తాను శుభ్రంగా స్నానపానాదులు కానిచ్చేశాడు ఆనంద్.

అటుపై భార్య పక్కనే సోఫాలో జారగిలబడి, ఆ వేళటి న్యూస్ పేపర్ తిరగేస్తుండగా అతనికి మాగన్నుగా నిద్ర పట్టింది.

కళ్ళు విప్పింది సత్యవతి.

'వాహ్! గ్రీకు శిల్పంలా ఎంత బావున్నాడ తను...

లాల్చీ జుబ్బా...వుంగరాల జుత్తూ..బ్యాంక్ ఆఫీసరు ఉద్యోగం తెచ్చిన హోదా..అదృష్టం! అఫ్‌కోర్స్ తనను చేసుకున్నాకే కదూ!

కళాదృష్టితో చూస్తే ఆడదానికి మగవాని రూపం సమ్మోహనాస్త్రం లాంటిదే!

అయినా మగవానికి బాహ్య రూపం కన్నా మనో సౌందర్యమే ముఖ్యం. అదతనిలో మెండుగా వుండబట్టే గదా, భార్య పక్కన లేకుండానే పనులన్నీ కానిచ్చాడు...'

భర్తపై అభిమానం, కృతజ్ఞత పెల్లుబుకుతుండగా—

"లేవండి బెడ్‌రూమ్‌లో పడుకుందురు గాని" అంటూ తట్టి లేపిందతన్ని సత్యవతి.

"నువ్వెప్పుడు లేచావు?" ఆవులిస్తూ కళ్ళు తెరిచాడతను.

ఆ ఉత్తముని ముందు బొంక దల్చుకోలేదు సత్యవతి.

అంతదాకా జరిగింది క్లుప్తీకరించింది.

సాంతం విన్నాక—

"మగవాళ్ళకు కొమ్ములేం లేవు. నన్నడిగితే ఎవరి పనులు వారు చేసుకుపోవడమే బెటరంటాను. భార్య అయినంత మాత్రాన సేవకురాలిలా భర్త కాలు కదపకుండానే అన్నీ అమర్చాలని లేదు" ఇలా చెప్పుకుంటూ పోతూ భార్యాభర్తల మధ్య అనుబంధం, అవగాహనలకు సంబంధించి చక్కని సాదృశ్యాలెన్నింటినో వివరించాడు ఆనంద్.

అతని విందు సంస్కారం, విశాల భావాలకూ తగ్గట్టే హృదయ పూర్వకంగా బెడ్‌పై అందుకు గాను బాగా సహకరించింది సత్యవతి.

* * *

"మా ఆవిడదో సెపరేటు తత్వం బ్రదర్! వారంలో అన్ని రోజుల్లోనూ వంట, ఇంటి పన్లూ తనకూ, నాకూ సమానంగా కేటాయించగానే 'శాక్ అదెలా వీలవుతుంది? నేను ఉద్యోగం చేసే మగవాణ్ణి. బయట సవాలక్ష సమస్యలతో నేను వచ్చీ, వెడీ ఇంటికి రాగానే ఒళ్లొంచలేను. అది నాకు వీలు కాదు. అదెంత పనైనా సరే! ఇంటి వరకూ అన్నీ నువ్వే చూసుకోవాలి. అలా వీలు కాదంటావా? నిక్షేపంగా మీ వుట్టింటికెళ్ళి పోవచ్చు! ఇంకో ఒద్దికైన ఆడదాన్ని చూసి నేను కట్టుకుంటాను అంటూ ఎదురు తిరిగాను. ఆమె అహం దెబ్బ తింది. ఇంటిపని ఇద్దరమూ పంచుకోవాల్సిందే! లేదా తాను పుట్టింటికి వెడతానని పంతం పట్టింది. అప్పటికీ నేను లొంగక పోయేసరికి నా చావేదో నన్నే చావమంటూ చక్కా చెప్పినంత పని చేసింది. అడుగడుగునా ఆ సేవలకు ముఖ్యంగా రాత్రి పడక సుఖానికి బాగా అలవాటు పడ్డాక, ఇప్పుడవన్నీ దూరమై పోయేసరికి నా పాట్లూ, బాధలూ ఏం చెప్పేదిలే బ్రదర్!" లంచ్ బ్రేక్‌లో కొలీగ్ శ్రీనివాస్ చెబుతుంటే తలూపుతూ అంతా శ్రద్ధగా విన్నాడు ఆనంద్.

"నాకు తెలిసీ మీ ఆవిడ అంత కఠినమైనది కాదే! పేరుకు నిన్ను ఇంటి చాకిరీ పంచుకోమందే కానీ, నువ్వేం చేస్తున్నా తనూ వేదోడు వాదోడుగా వుంటుందా? ఆడుతూ, పాడుతూ మీరిద్దరూ చిలకా గోరింకల్లా మసలక ఇదెందుకొచ్చిన మనస్తాపం చెప్పు? 'మేల్ ఈగో' ఇంట్లో చూపడం వల్ల ఇలాగే దెబ్బ తినాల్సి వుంటుంది" తనకు తెలిసింది చెప్పాడతనితో.

"నీలాంటి కొలీగ్స్ అడపాదడపా మా ఇంటికొస్తుంటారా...అదే సమయాన నేను ఆడంగి పనులు చేస్తూ మీ కంట పడ్డాననుకో! నన్నో ఆడంగి రేకుల వెధవ కింద జమ కడతారనేదే నా వెనుకంజ. నిజం చెబుతున్నాను— మా ఆవిడ నాకు నచ్చకా కాదు, నన్ను కష్టపెడుతుందనీ కాదు.."

"ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు శ్రీనూ! కావాలంటే నేనూ నీతో వస్తాను. ఇద్దరం నచ్చజెప్పి మీ ఆవిడని పుట్టింటి నుంచి తీసుకొద్దాం. ఇకనైనా నీ అపోహలూ, లేనిపోని భేషజాలు మానుకో! భార్యా భర్తల్లో హెచ్చు తగ్గుల నేవే లేవు. ఒకరినొకరు కించపరుచుకోవడాలు తగదు. కష్టం—సుఖం పరి సమానంగా పంచుకున్నప్పుడే దాంపత్యానికి అర్థం. ఇలా మిత్రునికి సంసార నీతి చంద్రిక వల్లించి ఇదే ఆ రాత్రి భార్య దగ్గర ప్రస్తావించాడు ఆనంద్.

"మరీ మీ మగవారికి ఇంత మంచితనం పనికిరాదు శ్రీవారూ! భార్యా భర్తలు ఒకరికొకరు కూడబలుక్కొని ఏదైనా చేసుకోవాలి గానీ, ఒక పక్షం నుంచే అడుగు ముందుకేయడం అన్ని వేళలా రెండో పక్షానికి నచ్చకపోవచ్చు" ఆమె అభిప్రాయం చెబుతుండగా ఫోను రింగయ్యింది. లిఫ్ట్ చేసిన ఆనంద్ అవతలి వారితో కాసేపు మట్లాడి "శ్రీనివాసులే! ట్రయల్‌గా భార్యతో ఫోన్లో మాట్లాడాడట! ఇతని క్షమాపణా ధోరణికి ఆవిడ కరిగి ఇంటికొస్తానందట! నేనతనితో ప్రయాణం కడతానన్నాను కదా! ఆ శ్రమ తప్పిందయితే" ఫోను పెట్టేసి చెప్పాడు.

"ఒకోమారు మా ఆడాళ్ళతో వచ్చిన తంటానే ఇంత! శాంతంగా ఏదైనా భరిస్తే పరిస్థితులు వాటంతట అవే చక్కబడతాయి. ఆ నేర్పూ, ఓర్పూ లేకుంటే ఇదిగో..ఇలాంటి పరిణామాలే! "

"మా మగాళ్ళ లోనూ మూర్ఖులున్నారు. తమ పంతమే నెగ్గాలని భీష్మించుకుంటే అన్నీ చిక్కులే! ప్చ్ రకరకాల మనుషులు..మనస్తత్వాలు..ఏమిటో..!"

"ఎవరెన్ని రకాలైనా మనది మాత్రం ఒకే మాట, ఒకే చేత. భిన్నత్వంలో ఏకత్వం. రైట్! మాట్లాడుతుంటే బూరెల్లాంటి సత్యవతి బుగ్గల్లో పడే సొట్ట దగ్గర ఒంగి ఓ తీపి ముద్దిచ్చాడు ఆనంద్.

"ఛీ! ఎంగిలి.." ఆమె కళ్ళు అల్లల్లార్చింది.

'టిట్ ఫర్ టాట్'గా ఆ ఎంగిలేదో నువ్వూ నాకు అంటించేయ్" చిలిపిగా అన్నాడు ఆనంద్.

"ఆశపాపం!" వెక్కిరించిందామె.